సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



అభయారణ్యంలో..

పరమశివుడి పంచాక్షరి ఓం నమః శివాయ స్మరణతో నల్లమల ప్రతిధ్వనిస్తోంది.

వివరాలు 8లో ▸



మెనూ తప్పనిసరి

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /18.2

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాల సేకరణ పెంచాలి



అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాల రైతుల నుంచి నాణ్యమైన పాలు సేకరించి విజయ డైరీ అభివృద్ధికి కృషి చేయాలని డైరీ డెవలప్‌మెంట్ అధికారి కవిత అన్నారు. గురువారం అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రంలో పాల సేకరణ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల సేకరణ తగ్గకుండా రైతులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ.. వారు ప్రైవేట్ సంస్థల వైపు మళ్లకుండా పాల సేకరణ చేయాలన్నారు. పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటేనే అధిక పాలు ఇస్తాయని, ఇందుకోసం విజయ డైరీ ద్వారా సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, దాణా, మినరల్ మిక్చర్, క్యాల్షియం సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు. అచ్చంపేటలో 63 సెంటర్ల ద్వారా ఇంతకు ముందు ప్రతిరోజూ 10 వేల లీటర్ల పాల సేకరణ జరిగేదని, ప్రస్తుతం 7 వేల లీటర్ల పాలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. పాలలో ఫ్యాట్ 6, 7 శాతం వచ్చే లా నాణ్యమైన పాలు సేకరించాలని సూచించారు. అయితే ఫ్యాట్‌ను నిర్ధారించే పరికరాలు, పాలు కొలిచే యంత్రం, రైతుల జాబితా నమోదు చేసుకునే రిజిష్టర్లు ఇవ్వాలని, గేదె పాల ధరలు పెంచాలని, పాల సేకరణ ఏజెంట్లు సంబంధిత అధికారిని కోరారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అందజేసేందుకు కృషిచేస్తానన్నారు. సమావేశంలో విజయ డైరీ చైర్మన్ నర్సయ్యయాదవ్, మేనేజర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ఆపాలని పోస్టుకార్డు ఉద్యమం



బల్మూర్: మండలంలోని మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు మైనింగ్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు గుండాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మైలారం గ్రామ మైనింగ్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపి నిరసన తెలిపారు. వెంటనే గుట్టపై జరుగుతున్న మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనింగ్ వ్యతిరేక కమిటీ సభ్యులు దేవస్వామి, రమేష్‌గౌడ్, లింగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులతో ప్రయోజనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మేధో సంపత్తి హక్కులతో పరిశోధనలు చేసే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో మేధో సంపత్తి హక్కులపై ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పూర్తి స్థాయి హక్కులు పొందిన తర్వాతనే వాటిని ప్రకటించాలని, అప్పుడు ప్రచురణలు, ప్రయోగాలకు పూర్తిస్థాయిలో విలువ ఉంటుందన్నారు. ఆవిష్కరణలకు పరిరక్షణ, హక్కులు కలిగి ఉండాలంటే తప్పకుండా మేధో సంపత్తి హక్కులుండాలని, రీసెర్చ్ విద్యార్థులు అధ్యాపకులు వీటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇప్పుడు చేసిన ప్రయోగాలు భవిష్యత్ అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, వక్త శంకర్‌రావు, ఐక్యూఏసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, మధు, అర్జున్‌కుమార్, కుమారస్వామి, శాంతిప్రియ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



తెలకపల్లిలోని ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా నిర్మించిన దుకాణాలు

అనుమతుల్లేవ్.. చర్యల్లేవ్

తెలకపల్లి వివాదాస్పద భూమిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టింపు కరువు
- విచారణ పేరుతో చర్యలకు కాలయాపన
- రాజకీయ నేతల ప్రమేయంతోనే వెనుకడుగు
- తాజా పరిణామాలపై కలెక్టర్ సీరియస్?

నాగర్‌కర్నూల్: అధికారం బలం, అధికారుల అండ ఉంటే ఎంతటి అక్రమాలకైనా పాల్పడవచ్చనేది మరోమారు నిరూపితమైంది. తెలకపల్లిలోని **ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా 40 దుకాణాలు నిర్మిస్తే కనీసం చర్యలు** తీసుకునే పాపాన పోకుండా ఆ అక్రమాలకే సహకరించారు. గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఓ ప్రజాప్రతినిధి ఈ నిర్మాణాలకు పూర్తిస్థాయిలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే అధికారం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా కూడా వాటిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనకడుగు వేస్తుండటం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అక్రమాల్లో అన్ని పార్టీల హస్తం ఉందనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారిపై ఉండటం, విలువైన స్థలం కావడంతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి ఈ నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నోటీసులు ఇచ్చాం



మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన దుకాణాలకు సంబంధించి గతంలోనే రెండుసార్లు నోటీసులు ఇవ్వడం జరిగింది. కానీ, వారి నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– భాస్కర్, పంచాయతీ ఈఓ, తెలకపల్లి

విచారణ జరిపాం..



తెలకపల్లిలో అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి విచారణ జరిపాం. విచారణకు సంబంధించిన రిపోర్ట్ జిల్లా పంచాయతీ అధికారికి అందజేశాం. ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవని రిపోర్ట్‌లో పేర్కొనడం జరిగింది.

– వరలక్ష్మి, డీఎల్‌పీఓ, నాగర్‌కర్నూల్

కలెక్టర్‌కు నివేదిస్తాం..

తెలకపల్లిలోని సర్వే నంబర్ 497లో దుకాణాల నిర్మాణాలకు సంబంధించి విచారణ పూర్తయింది. మరో రెండు, మూడు రోజుల్లో వచ్చిన రిపోర్ట్‌ను స్టడీ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం.

– రామ్మోహన్, డీపీఓ

అసలేం జరిగిందంటే..

తెలకపల్లిలోని సర్వే నం.497లో ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణ సముదాయ నిర్మాణాలు చేపట్టారు. అయితే ఈ స్థలం భూదాన్ భూమి అని, దీనికి అసలైన వారసులం తామేనని, ఇద్దరు వ్యక్తులు గత కొన్ని సంవత్సరాలుగా ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. భూదాన్ భూమి తాము రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి మ్యూటేషన్ అయినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, తహసీల్దార్ కార్యాలయంలో ఎండార్స్‌మెంట్ కాపీ సైతం అందజేశారు. అయితే ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు మాత్రం అధికారులు తీసుకోవడం లేదు. అంతేకాకుండా సదరు వ్యక్తులతో రాజీ కుదుర్చుకునేందుకు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. నిర్మాణ సమయంలో ఒక్కో దుకాణానికి రూ.2 లక్షల వరకు అధికారులు, అప్పటి పాలకవర్గం వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా అధికారి వరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడంతో 2024 ఆగస్టు 12న హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో డీఎల్‌పీఓ వరలక్ష్మి విచారణ జరిపినా.. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రజావాణిలో ఫిర్యాదు..

తాజాగా ఈ అక్రమ నిర్మాణాల విషయంపై కలెక్టర్ బదావత్ సంతోష్ సైతం అధికారులపై సీరియల్ అయినట్లు తెలిసింది. బాధితులు సోమవారం ప్రజావాణిలో మరోమారు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులను పిలిచి అనుమతులు లేకుండా ఇన్ని దుకాణాలు నిర్మిస్తుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించడంతోపాటు త్వరలోనే ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

నేడు ‘పేట’కు సీఎం రేవంత్



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారుల బృందం

- రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం నారాయణపేట జిల్లాకేంద్రానికి రానున్నారు. ఈ సందర్భంగా రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ దిశానిర్దేశంతో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లను సిద్ధం చేసింది.

సీఎం శుక్రవారం మధ్యాహ్నం 12.10 గంటలకు హెలికాప్టర్‌లో నారాయణపేట మండలంలోని సింగారం చౌరస్తా సమీపంలోని గురుకుల పాఠశాల దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.1.23 కోట్లతో నిర్మించిన నూతన పెట్రోల్ బంకును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటలకు అప్పక్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌కు భూమి పూజ చేస్తారు. 1.35 గంటల నుంచి 2 గంటల వరకు రూ.130 కోట్లతో నారాయణపేట ప్రభుత్వ వైద్యకళాశాల, హాస్టల్ నిర్మాణానికి, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి, రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, రూ.40 కోట్లతో 100 పడకల యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రూ.56 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల ఫస్టియర్ అకాడమిక్ బ్లాక్‌ల ప్రారంభించనున్నారు. వీటితో పాటు ధన్వాడ, నారాయణపేట రూరల్ పోలీస్‌స్టేషన్లు, వివిధ గ్రామాల్లో రూ.500కోట్లకుపైగా నిధులతో నిర్మించనున్న రోడ్లు, హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 2.10గంటలకు బహిరంగసభలో పాల్గొని, మాట్లాడుతారు.

పర్యవేక్షించిన అధికారుల బృందం

సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ క్రిస్టియానా, ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఐఅండ్‌పీఆర్ కమిషనర్ హరీశ్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సింగారం చౌరస్తాలోని హెలీప్యాడ్ స్థలాన్ని, సమీపంలోని నూతన పెట్రోల్ బంక్, వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని, అప్పక్‌పల్లి వద్ద సీఎం భూమి పూజ చేసే ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని అధికారుల బృందం పరిశీలించింది. అనంతరం మెడికల్ కళాశాలలో ఏర్పాట్ల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. బహిరంగసభ వేదిక పక్కన గ్రీన్ రూమ్, వేదికపై సీటింగ్ కెపాసిటీ, వీఐపీ గ్యాలరీ తదితర వాటిపై చర్చించారు. అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలు సైతం ఏర్పాట్లను పరిశీలించారు.

సీఎం పర్యటనకు 1000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, సంగారెడ్డి ఎస్పీలు, ఇద్దరు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 28 మంది సీఐలు, 81మంది ఎస్‌ఐలు, 133 మంది ఏఎస్‌ఐలు, 750 కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీఎం పర్యటన ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను మల్టీజోన్–2 ఐజీపీ సత్యనారాయణ, జోగుళాంబ జోన్ –7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ పరిశీలించారు.

గంజాయి సాగు, సారా తయారీపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కూచుకుళ్ల, కసిరెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లాలో గంజాయి సాగు, సారా తయారీ, సరఫరాపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్‌ను సారా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి ఎక్సైజ్, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ దేశానికి యువత అత్యుత్తమమైన సంపద అని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పేదలు సారా తాగి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారన్నారు. యువకులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసమే సారాను రూపుమాపేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, సారా తయారీ జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించొద్దని చెప్పారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, తనిఖీల్లో నమోదు చేసిన కేసుల వివరాలను కలెక్టర్, ఎస్పీలు మంత్రికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపటినుంచి స్పెషల్ డ్రైవ్ తనిఖీలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం శనివారం నుంచి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా మైనర్లు వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే కేసు నమోదు చేయడంతోపాటు తల్లిదండ్రులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అలాగే నంబర్ ప్లేట్ లేని వాహనాలు రోడ్లపైకి తీసుకువస్తే సీజ్ చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు.

నాసిరకం సరుకులతో మధ్యాహ్న భోజనం

బిజినేపల్లి: మండలంలోని పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమకు మధ్యాహ్నం అందించే భోజనం నాణ్యతగా లేదని, ప్రశ్నించిన తమను వంట ఏజెన్సీ మహిళలు దుర్భాషలాడుతున్నారని గురువారం ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట కోసం నాసిరకం సరుకులు ఉపయోగిస్తున్నారని, దీంతో ప్రతిరోజు మధ్యాహ్నం సరిగా భోజనం తినలేకపోతున్నామని అధికారుల ఎదుట వాపోయారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన తహసీల్దార్ శ్రీరాములు, ఎంఈఓ రఘునందన్‌రావు నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని, ప్రస్తుతానికి వంట ఏజెన్సీని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై మహిళా సంఘాల సహకారంతో శుక్రవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, భోజన నాణ్యతపై ఉపాధ్యాయులు కూడా దృష్టిపెట్టాలని సూచించారు. విద్యార్థుల నుంచి ఆందోళన నెలకొన్న నేపథ్యంలో వంట ఏజెన్సీ సిబ్బంది కూడా స్వచ్ఛందంగా తప్పుకుంటామని అధికారులతో చెప్పారు. దీంతో విద్యార్థులు తమ తరగతి గదులకు వెళ్లిపోయారు. కాగా నూతన ఏజెన్సీని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు.



పాఠశాలలో విచారణ చేపడుతున్న అధికారులు


ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు



అమరగిరి సమీపంలో తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది

కొల్లాపూర్: మండలంలో రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గురువారం అమరగిరి, మారెడుమాన్‌దిన్నె, యాపట్ల, చంద్రబండతండా, జొన్నలబొగుడ తదితర గ్రామాల్లో తనిఖీలు చేపట్టి.. 150 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటికను స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏఈఎస్ భాస్కర్ మాట్లాడారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 10 టీంలతో కలిసి రెండు రోజుల పాటు విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. గంజాయి విక్రయాలపైనే దృష్టిసారించామన్నారు. జిల్లావ్యాప్తంగా నెలరోజులుగా స్పెషల్ డ్రైవ్ కొనసాగించామన్నారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 21 కేసులు నమోదు చేసి, 26 మందిని అరెస్టు చేశామన్నారు. 4,500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని, 118 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 24 వాహనాలు, 9 సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన తనిఖీల్లో డీఎస్పీ తిరుపతియాదవ్, ఎస్టీఎఫ్ టీం లీడర్స్ అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, ఎక్సైజ్, పోలీస్ శాఖకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


‘సీఎం ఇంటిని ముట్టడిస్తాం’



రిలే దీక్షలో మాట్లాడుతున్న వర్ధం పర్వతాలు

చారకొండ: చారకొండలో జాతీయ రహదారి బైపాస్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మండల కేంద్రంలో బైపాస్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 10వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన బాధితులకు మద్దతుగా సంఘీభావం తెలిపి మాట్లాడారు. బైపాస్ నిర్మాణంలో అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా 29 మంది ఇళ్లను నేలమట్టం చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారికి న్యాయం చేయాలని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో వారికి ఇచ్చిన నష్టపరిహారం ఏమాత్రం సరిపోదని, ఇంటిస్థలం కూడా రాదన్నారు. బాధితులకు నూతన స్థలం కేటాయించి.. ఇల్లు నిర్మించి ఇవ్వాలని, లేదా రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు బాధితులకు అండగా ఉంటామన్నారు. ఈ నెల 24న చారకొండ నుంచి బైపాస్ బాధితులతో పాదయాత్రగా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు శ్రీనివాసులు, నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి బాలస్వామి, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీను, బాధితులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.7,307



కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగ క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,307, కనిష్ఠంగా రూ.4,121, సరాసరిగా రూ.6,300 ధర లభించింది. అలాగే కందులు క్వింటాల్‌కు రూ.6,269, కనిష్ఠంగా రూ.6,138 చొప్పున వచ్చాయి. ఈ క్రమంలో మార్కెట్ చైర్మన్ సంజీవ్‌యాదవ్ కొనుగోళ్లను పరిశీలించారు. అలాగే మార్కెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద పంపిణీలో రైతులతో కలిసి భోజనం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.



అడుగంటుతున్న కృష్ణమ్మ

గతేడాది వర్షాకాలంలో కృష్ణానదికి భారీగా వరదలు వచ్చినప్పటికీ బ్యాక్‌వాటర్ భారీగా తగ్గిపోతోంది. వివిధ ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీటికి తరలింపు, వేసవి నేపథ్యంలో నిల్వ నీరు వేగంగా అడుగంటుతోంది. దీంతో పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి గ్రామాల శివారులో కృష్ణానది బురదమయంగా కనిపిస్తుంది.

– పెంట్లవెల్లి

క్లుప్తంగా

రైలు ఢీకొని యువకుడి మృతి

గద్వాల క్రైం/ మదనాపురం: గుర్తు తెలియని రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున వనపర్తి రోడ్, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ మధ్య 167 కిలోమీటర్ దగ్గర గుర్తుతెలియని యువకుడు(31) రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఫోన్ నం .83412 52529ను సంప్రదించాలని కోరారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

గోపాల్‌పేట: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేవల్లి మండలం కొంకలపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లయ్య వివరాల మేరకు.. కొంకలపల్లికి చెందిన కల్మూరి శివలీల (38), బంగారయ్య భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన శివలీల.. తెల్లవారుజామున తమ వ్యవసాయ పొలంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గొంతు కోసుకున్న యువకుడు

మహమ్మదాబాద్: కుటుంబ తగాదాలతో ఓ యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మహమ్మదాబాద్ మండలం చౌదర్‌పల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చౌదర్‌పల్లికి చెందిన ఖాసీం కుటుంబ తగాదాలతో మనస్తాపానికి గురై బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం ఇంటికి పంపించారు.

అడవి జంతువు దాడిలో గేదె మృతి

ధన్వాడ: మండలంలోని హనుమాన్‌పల్లి శివారుని కపిలగుట్టలో పొలం వద్ద కట్టేసిన గేదెపై బుధవారం రాత్రి అడవి జంతు దాడి చేయడంతో మృతిచెందిందని బాధిత రైతు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయగా వారు వచ్చి పరిశీలించారు. దాడి చేసిన జంతువు ఏది అనేది నిర్ధారించేందుకు సమయం పడుతుందని అటవీ శాఖ అధికారి పద్మారావు చెప్పారు.

దూడపై చిరుత దాడి

నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులో ఓ లేగదూడపై చిరుత దాడికి పాల్పడింది. గురువారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు లేగదూడ మృతదేహాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో చిరుత అడుగుజాడలు ఉన్నట్టు గుర్తించారు. గ్రామ సమీపంలోని గుట్టల నుంచి చిరుత వచ్చి దూడపై దాడికి చేసినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వ ద్వారా 160 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

మైనర్లతో వెట్టిచాకిరీ నేరం

ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లిలో బాల కార్మికుడితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న పెంటయ్య, శ్రీనివాసులుపై తహసీల్దార్ సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన బాలుడితో రెండున్నరేళ్లుగా పని చేయించుకుంటున్నారు. ఈ విషయంపై ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఈనెల 18న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ ఫిరట్వానిపల్లికి వెళ్లి పంచనామా నిర్వహించి అనంతరం ఆ బాలుడిని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి



మాచారం అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ఆనంద్, గోవర్ధన్, అధికారులు

- అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు నాణ్యతగా ఉండాలి
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు/జడ్చర్ల టౌన్/భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనంలో ప్రభుత్వం ఇచ్చిన మెనూను వంద శాతం తప్పనిసరిగా అమలుచేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలు, సరకులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాల్లో అధికారుల వివరాలతో కూడిన బోర్డులతో పాటు ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు నాణ్యతగా ఉండాలన్నారు. గుడ్ల సైజ్ చిన్నగా ఉంటే వెనక్కి పంపించాలని తెలిపారు. రేషన్ దుకాణాల్లో అంత్యోదయ కార్డు కల్గిన వారికి చక్కెర, గోధుమలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. 15 నుంచి 20వ తేదీ వరకు రేషన్ తీసుకునే వారికి బియ్యం కొరత లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆహార కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, ఆర్డీఓ అనిల్, డీఎంహెచ్ఓ డా.కృష్ణ ఉన్నారు.

■ అంతకు ముందు జడ్చర్ల మండలం మాచారంలో రేషన్ దుకాణాన్ని ఆహార కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ తనిఖీ చేశారు. ప్రతినెలా 18వ తేదీ వరకే రేషన్ సరకులు ఇవ్వకపోవడం, ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పుపట్టారు. అంత్యోదయ లబ్ధిదారులకు పంచదార ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. జిల్లాలో 18వ తేదీ వరకు 80 శాతం లబ్ధిదారులు మాత్రమే రేషన్ సరకులు పొందారని.. మిగతా 20 శాతం లబ్ధిదారులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇకపై ప్రతి రేషన్ దుకాణంలో అవసరమైన నిల్వల కన్నా అదనంగా తీసుకుని 25వ తేదీ వరకు సరకులు ఇచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు కూరగాయలతో కూడిన సాంబర్ వడ్డించాల్సి ఉండగా.. కేవలం సొరకాయ మాత్రమే తయారు చేయడాన్ని తప్పుపట్టారు. ఇళ్లల్లో ఇలాగే తింటారా అంటూ అంగన్‌వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. కోడిగుడ్లు కొన్ని సాధారణ పరిమాణం కన్నా చిన్నవిగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. కోడిగుడ్ల కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇకపై చిన్న గుడ్లను సరఫరా చేయవద్దన్నారు. కోడిగుడ్లు చిన్నవిగా ఇచ్చినా ఎందుకు తీసుకుంటున్నారని అంగన్‌వాడీ టీచర్‌ను నిలదీశారు. విషయాన్ని సూపర్‌వైజర్‌కు వివరించామని బదులివ్వడంతో సీడీపీఓ, డీడబ్ల్యుఓలపై అసహనం వ్యక్తంచేశారు. కాగా, గొల్లపల్లి వద్ద ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆహార కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వాగతం పలికారు.

■ భూత్పూర్ మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆహార కమిషన్ చైర్మన్ పరిశీలించారు. రోజు భోజనంలో అందిస్తున్న మెనూ గురించి విద్యార్థులతో ఆరా తీశారు. కార్యక్రమాల్లో డీఎస్ఓ వెంకటేశ్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, డీడబ్ల్యుఓ జరీనాబేగం, డిప్యూటీ డీఎంహెచ్ఓ శశికాంత్, సీడీపీఓలు ప్రభాకర్, శోభారాణి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, డీటీ కిశోర్, ఎంఈఓ ఉషారాణి ఉన్నారు.

అభయారణ్యంలో శివ శరణు ఘోష



పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న శివస్వాములు

- శ్రీశైల క్షేత్రానికి శివస్వాముల పాదయాత్ర
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ప్రధాన రహదారి

అచ్చంపేట: మహాశివుడి శరణు ఘోషతో నల్లమల ప్రతిధ్వనిస్తోంది. హర హర మహాదేవ శంభో శంకర.. ఓం నమఃశివాయ.. శివాయ నమఃఓం.. అంటూ శివస్వాములు, భక్తులు మార్మోగిస్తున్నారు. శివదీక్ష చేపట్టిన స్వాములతో పాటు భక్తులు చాలా మంది శ్రీశైలం క్షేత్రానికి కాలినకడన తరలివెళ్తున్నారు. నల్లమల దారి పొడవునా శివనామస్మరణ మార్మోగుతోంది. భక్తులకు అడుగడుగునా దాతలు తమకు తోచిన సాయం చేస్తూ.. అండగా నిలుస్తున్నారు. విడిది కేంద్రాలు, అన్నదానాలు, నీళ్ల ప్యాకెట్లు వితరణ చేయడంతో పాటు ప్రథమ చికిత్స అందిస్తూ తమలోని సేవాగుణం చాటుకుంటున్నారు.

రాత్రివేళ అధికంగా..

వివిధ ప్రాంతాల్లో మండల, అర్ధమండల దీక్ష చేపట్టిన శివస్వాములు చాలా మంది కాలినడకన శ్రీశైలం చేరుకొని మహా శివరాత్రి రోజున దీక్షను విరమిస్తారు. అయితే దారిలోనే నిత్యం ఉదయం, సాయంత్రం పవిత్ర స్నానాలు ఆచరించి.. శివాలయాల్లో లింగార్చన, బిల్వార్చనలతో పూజలు చేస్తూ రుద్రనమక చమకాలతో కైలాసనాథుడిని కొలుస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుండటంతో రాత్రివేళ నడుచుకుంటూ వెళ్లేందుకు మక్కువ చూపుతున్నారు.

విడిది కేంద్రాలు..

పాదయాత్రతో శ్రీశైల మహాక్షేత్రం వెళ్లే స్వాములకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి షామియానాలు, భోజనం, మంచినీటి సౌకర్యాలతో పాటు అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అచ్చంపేట, ఉమామహేశ్వరం, మన్ననూర్, ఫర్హాబాద్, వటువర్లపల్లి, రాసమల్లబావి, దోమలపెంటల వద్ద దాతలు విడిది కేంద్రాలను ఏర్పాటు చేశారు.



అచ్చంపేటలో శివస్వాములకు అల్పాహారం అందిస్తున్న దాతలు

■ శ్రీశైలం నల్లమల అభయారణ్యం మార్గంలో ప్రతి ఏటా 20కి పైగా అన్నదాన కేంద్రాలు వెలుస్తున్నాయి. అయితే మన్ననూర్ తర్వాత వటువర్లపల్లి వరకు ఎక్కడ కూడా వీరికి తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఉంది. వటువర్లపల్లి తర్వాత మళ్లీ దోమలపెంట వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

రోడ్డు మార్గంలో వెళ్లాలి..



శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న స్వాములు, భక్తులు రోడ్డు ప్రమాదంలో వెళ్లడం సురక్షితం. అడవి మార్గంలో జంతువుల నుంచి ప్రమాదం ఉంటుంది. ధారా బేష్ క్యాంపు, రాసమల్లబావి వద్ద భక్తులకు తాగునీటి వసతి కల్పిస్తున్నాం. 14 మంది సిబ్బందితో చెత్త సేకరిస్తున్నాం. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్త, కవర్లు తీయిస్తాం. మా సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు.

– రోహిత్ గోపిడి, డీఎఫ్ఓ

సూచనలు పాటించాలి..

పాదయాత్రగా వచ్చే శివస్వాములు, భక్తులకు అటవీ, పోలీసు శాఖలు ప్రత్యేక సూచనలు చేస్తోంది. నల్లమలలో అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ ప్రత్యేక ఆంక్షలు విధిస్తోంది. అమ్రాబాద్ అభయారణ్యంతో పాటు రక్షిత ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అడవి జంతువుల నుంచి స్వాములకు ప్రాణహాని కలగకుండా అటవీ మార్గంలో సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి రక్షణ కల్పిస్తున్నారు.

■ శివస్వాములు, భక్తులు అడ్డదారుల్లో వెళ్లరాదు. నిర్దేశిత ప్రాంతాలు, రోడ్డు వెంట మాత్రమే ప్రయాణించాలి. అటవీ మార్గంలోని కాలిబాటలో వెళ్లరాదు.

■ రోడ్డుకు మధ్యలో నడవకూడదు. రోడ్డుకు ఎడమవైపు నుంచి నడవాలి.

■ రోడ్డుపై విశ్రాంతి తీసుకోకూడదు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విరామ ప్రాంతాల్లో మాత్రమే సేద తీరేందుకు అనుమతి ఉంటుంది. అక్కడ తాగునీటి వసతి కూడా కల్పించారు.

■ అటవీ ప్రాంతంలో వంటలు వండటం, నిప్పు రాజేయడం నిషేధం. నిబంధనలు ఉల్లఘించి అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వారిపై అటవీశాఖ చర్యలు తీసుకుంటుంది.

■ ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద సూచనలను పాటించాలి.

■ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు అడవిలో వేయరాదు.

■ రాత్రివేళ పాదయాత్ర చేసే శివస్వాములు టార్చిలైట్ లేదా ముందు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి రహదారి సూచనగా తెల్లగుడ్డ కట్టాలి.

■ అడవి మధ్య మార్గంలో కోతులతో జాగ్రత్తగా ఉండాలి. తినే ఆహార పదార్థాలు కోతులకు వేయరాదు.

■ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అమ్రాబాద్ సీఐ (87126 57739), ఈగలపెంట ఎస్ఐ (87126 57741) నంబర్లను సంప్రదించాలి.

చికెన్ అమ్మకాలు నిలిపివేయండి : కలెక్టర్



పౌల్ట్రీఫాం యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని కొన్నూరు సమీపంలో ఉన్న ఓ పౌల్ట్రీఫాంలో అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత పడిన నేపథ్యంలో సమీప ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలను నిలిపివేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పౌల్ట్రీఫాంను పరిశీలించారు. కోళ్లు ఎలా మృత్యువాత పడ్డాయనే విషయంపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, సంబంధిత కోళ్ల ఫారం యజమానితో ఆరా తీశారు. ఇటీవల బయటకు ఏమైనా కోళ్లు అమ్మారా అని ప్రశ్నించగా.. ఎవరికి అమ్మలేదని, చనిపోయిన వాటన్నింటినీ ఫాం సమీపంలోనే పూడ్చివేసినట్లు యజమాని బదులిచ్చారు. సమీపంలో ఉన్న చికెన్ దుకాణాలను తెరవనీయొద్దని, ఎవరైనా అమ్మకాలు జరిపితే వెంటనే బైండోవర్ చేసి.. చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. సమీపంలో ఉన్న పౌల్ట్రీఫారాలను సైతం పశుసంవర్ధక శాఖ అధికారులు సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ఏదైనా ఫాంలో కోళ్లకు అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే.. స్టాక్ బయటికి వెళ్లకుండా ఆపివేయాలని ఆదేశించారు. మృత్యువాత పడిన కోళ్ల శాంపిల్స్ వీబీఆర్ఐకి పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చిన తర్వాత కారణాలు తెలుస్తాయని చెప్పారు. అనంతరం గ్రామంలో చికెన్ దుకాణాలను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ప్రసన్న కుమారి తదితరులు ఉన్నారు.

కోళ్ల దాణా పరిశ్రమ తనిఖీ



అమిస్తాపూర్ సమీపంలోని కోళ్ల దాణా పరిశ్రమ వద్ద అధికారులు

భూత్పూర్: అమిస్తాపూర్ సమీపంలోని నోవెల్‌టెక్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను జిల్లా పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌గౌడ్, జేడీ మమత, తహసీల్దార్ జయలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వనపర్తి జిల్లాలోని ఓ కోళ్ల ఫాంలో కోళ్లు బర్డ్‌ఫ్లూ వ్యాధితో మృతిచెందగా.. వాటికి ఇక్కడి నుంచే దాణ సరఫరా చేస్తున్నారు. దీంతో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు మధుసూదన్‌గౌడ్ తెలిపారు. దాణాను శాంపిల్స్ సేకరించామని, పరిశ్రమకు వచ్చే వాహనాలకు ప్రతిరోజు శానిటేషన్ చేయాలని పరిశ్రమ సిబ్బందికి సూచించామని చెప్పారు. పూర్తి నివేదికను కలెక్టర్ అందజేస్తామని పేర్కొన్నారు. వారి వెంట మండల పశు వైద్యాధికారి మధుసూదన్, ఆర్ఐలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం ఉన్నారు.

పిన్నంచర్లలో వైరస్ కలకలం



పిన్నంచర్ల పౌల్ట్రీ ఫాంలో శాంపిల్స్ సేకరిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

పౌల్ట్రీఫాంలో వెయ్యి కోళ్లు మృతి

ఆత్మకూర్: బర్డ్‌ఫ్లూ వైరస్ కలకలం రేపుతోంది. మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో పౌల్ట్రీ రైతు దామోదర్ ఫాంలో వెయ్యికిపైగా కోళ్లు మృతిచెందాయి. గురువారం జరిగిన ఈ ఘటనతో పౌల్ట్రీ యజమానులు ఉలిక్కి పడ్డారు. రైతు దామోదర్ తనఫాంలో 4 వేలకుపైగా కోళ్లు పెంచుతుండగా మూడురోజుల వ్యవధిలోనే వెయ్యికిపైగా కోళ్లు మృతి చెందాయని వాపోయాడు. ఈ విషయాన్ని పశు సంవర్ధశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం సందర్శించి మృతిచెందిన కోళ్లను పరిశీలించారు. చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పాతిపెట్టారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ గురువారం 450కి పైగా కోళ్లు మృతి చెందాయన్నారు. మృతిచెందిన కోళ్లను పరిశీలించి ఉన్నతాధికారులతోపాటు మహబూబ్‌నగర్ ఏడీడీఎల్ ల్యాబ్ డాక్టర్ కరుణశ్రీకి సమాచారం ఇచ్చామన్నారు. ఇక్కడ కోళ్లను పరిశీలించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఏ వైరస్‌తో చనిపోయాయనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని, వైరస్ వ్యాపించకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట పశు సంవర్ధక శాఖ జేవీఓ నిర్మల, ఏఎస్‌లు నాగరాజు, మహిమూద్ తదితరులున్నారు.

రూ.లక్షల్లో నష్టం..

పౌల్ట్రీ పరిశ్రమపైనే ఆధారపడి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి కోళ్లను పెంచుతున్నామని యజమాని దామోదర్ తెలిపారు. మాయదారి వైరస్ వచ్చి 2.5 కిలోల నుంచి 3 కిలోల వరకు పెరిగిన కోళ్లు చనిపోవడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని కోరారు.

టమాటాలో సస్యరక్షణ చర్యలు



పురుగు ఆశించిన ఆకు, టమాటా



టమాటా తోటకు ఆశిస్తున్న పురుగు

అలంపూర్: టమాటా పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ అన్నారు. జిల్లాలో ఉన్న అనుకూల పరిస్థితుల్లో రైతులు టమాట పంట సాగు చేశారు. టమాటాలో ఆకు తొలుచు పురుగు ఆశించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ పురుగు ఆశిస్తే పంట యొక్క ఆకులను పూర్తిగా తిని వేస్తుంది. ఆకులనే కాకుండా మొగ్గలు, కాయలకు ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. దీని వలన 50 నుంచి 100 శాతం వరకు నష్టం జరగవచ్చని తెలిపారు. దీనిని ఆకు తొలుచు పురుగు లేదా పినివామ్ అంటారని పేర్కొన్నారు. దీని శాస్త్రీయ నామం టూట అబ్సులూట్. ఇది అమెరికా ప్రాంతానికి చెందినది. ప్రస్తుతం మన ప్రాంతాల్లో ఈ పురుగును గుర్తించినట్లు చెప్పారు.

నష్టపరిచే విధానం..

రెక్కల పురుగు 7 నుంచి 8 మిల్లీ మీటర్ల పొడవు ఉండి గోధుమ లేదా బూడిద రంగులో ఉంటాయి. తల్లి పురుగులు లేత ఆకుల కింద, తొడిమల కింద సుమారు 200 గుడ్ల వరకు పెడుతుంది. వీటి నుంచి వచ్చిన పిల్ల పురుగులు లేత ఆకులపై వంకర టింకర సొరంగాలు చేసి ఆకు పచ్చని పదార్థాన్ని తినివేస్తాయి. దీని వలన కణాలు తెల్ల బారిపోతాయి. ఈ పురుగు లేత ఆకు కాండం, మొగ్గలు, పచ్చి కాయలపై రంధ్రాలు చేసి ఆశించడంతో కాయ కుళ్లు వాసన వస్తుంది. ఈ పురుగులు తక్కువ సమయంలో ఎక్కువ పునరుత్పత్తి జరిగి అధిక సంఖ్యలో ఉండటంతో అధిక నష్టం జరుగుతుంది.

నివారణ ఇలా.. పురుగు లార్వాలు ఆకుల లోపల ఉండటంతో రసాయన మందులతో నివారించడం చాలా కష్టం. సమగ్ర సస్యరక్షణ చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి.

■ ప్రతిసారి ఒకే పొలంలో టమాటా పంటను సాగు చేయరాదు.

■ పంట చుట్టూ కంచె పంటగా జొన్న, మొక్కజొన్న నాలుగు సాళ్లు నాటితే వాటిపై ఈ పురుగులు చేరుతాయి. దీంతో కొంత వరకు పురుగులను నివారించవచ్చు.

■ పొలం వెంబడి, గట్ల వెంట ఉమ్మెత్త మొక్కలు లేకుండా చూడాలి. లేకపోతే ఈ మొక్కలు పురుగులకు అతిథ్యం ఇస్తాయి.

లింగాకర్షక బుట్టలు

మగ పురుగులను ఆకర్షించే లింగాకర్షక బుట్టలను ఎకరానికి ఎనిమిది అమర్చుకుంటే మగ పురుగులను నియంత్రించవచ్చు. ఎందుకంటే మగ పురుగులు లేకపోతే సంతానోత్పత్తి వృద్ధికాక పురుగు మనుగడ సాధించలేదు.

పసుపు రంగు అట్టలకు జిగురు

ఏ పురుగునైనా ఆకర్షించే గుణం పసుపు రంగు అట్టలకు అధికంగా ఉంటుంది. పసుపు రంగు అట్టలకు గ్రీసు, జిగురు పట్టించి పొలంలో కర్రలకు కడితే రెక్కల పురుగుల వాటికి అతుక్కొని చనిపోతాయి.

రసాయన పద్ధతులు

ఈ పురుగులకు రసాయనాలకు ఎక్కువగా తట్టుకొనే శక్తి ఉంటుంది. ఎక్కువ సార్లు ఒకే రసాయనం వాడకుండా సూచించిన మందులను మార్చి పిచికారీ చేసుకోవాలి. సైనోసాడ్ 0.3 మి.లీ, కొరాజెన్ 0.3 మి.లీ, డెల్టా మెత్రిన్ 0.5 మి.లీ, ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ, వేప నూనె 5 మి.లీ, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 1.5 గ్రాములను లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. తెలకపల్లి మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన శేఖర్, శ్రీనివాసులు బుధవారం ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా తాడూరు మండలం గుంతకోడూరు వద్ద అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రిలో ఉంచగా బాధిత కుటుంబ సభ్యులతోపాటు సగర సంఘం నాయకులు జనరల్ ఆస్పత్రి వద్దకు చేరుకుని న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో 3 గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సీఐ కనకయ్యగౌడ్ అక్కడికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొల్లబాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు గౌరక్క సత్యం, విజయలక్ష్మి, అల్లం రాముడు, నర్సింహ్మా, చిలుక పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.